క్లుప్తంగా

జగన్‌ను కలిసిన నేదురుమల్లి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

అనాథాశ్రమానికి విరాళం



నెల్లూరు(బృందావనం): నగరానికి విచ్చేసిన అంతర్జాతీయ వాకర్స్ సంఘ అధ్యక్షురాలు ప్రభావతిని పొదలకూరు రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జెడ్పీ వాకర్స్ సంఘ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. అనంతరం గొల్లపల్లిలోని శరత్ అనాథ శరణాలయానికి రూ.12 వేల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. అంతర్జాతీయ వాకర్స్ సంఘ పూర్వాధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి, పూర్వ గవర్నర్లు శ్రీనివాసరెడ్డి, ఎమ్వీ రెడ్డి, రాఘవరెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, జెడ్పీ వాకర్స్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చెలంచర్ల భాస్కర్‌రెడ్డి, ఖాజామస్తాన్, మహిళా కార్యదర్శి హర్షవర్ధిని, రాణమ్మ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. రత్నం, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రభావతి, నేతాజీ సుబ్బారెడ్డి, పలగాటి శ్రీనివాసులురెడ్డి, ఎమ్వీ రెడ్డి, ఏకొల్లు రాఘవరెడ్డి, బలరామనాయుడు, అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, సెక్రటరీ పొన్నం రవిచంద్ర, కోశాధికారి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

• ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాకారులు, వాకర్స్‌కు మజ్జిగ ప్యాకెట్లు, చాక్లెట్లను ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రభావతి, ఎన్బీఆర్ నాయుడు, నేతాజీ సుబ్బారెడ్డి, వెంకటాద్రిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కిలారి శ్రీనివాసులునాయుడు, నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు సత్వర చర్యలు



నెల్లూరు రూరల్: జిల్లాలో క్షయ నిర్ధారణ పరీక్షలను నిర్వహించి, వ్యాధి నిర్మూలనకు సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇన్‌టెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్ పోస్టర్లను కలెక్టరేట్లోని శంకరన్ సమావేశ మందిరంలో బుధవారం ఆవిష్కరించారు. డీఎంహెచ్‌ఓ సుజాత, లెప్రసీ ఎయిడ్స్, టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా మలేరియా నివారణాధికారి హుసేనమ్మ, కావలి, కందుకూరు ప్రోగ్రామ్ అధికారులు బ్రిజిత, రజని, డీపీఓ రమేష్, డెమో కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి క్రికెట్ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రికెట్ జట్లను శుక్ర, శనివారాల్లో ఎంపిక చేయనున్నామని క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ సొంత కిట్, ఆధార్‌కార్డుతో ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాలని కోరారు. డ్రస్ కోడ్‌ను పాటించాలని సూచించారు.

జాకీర్‌హుస్సేన్‌నగర్‌లోని సచివాలయం



మూతపడి ఇలా..



దీన్‌దయాళ్‌నగర్‌లోని సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



గ్రామ స్వరాజ్య లక్ష్యానికి తూట్లు

నెల్లూరులో ఇలా..	
కార్పొరేషన్ పరిధిలో సచివాలయాలు	166
నెల్లూరు రూరల్ మండలంలో	13

- సచివాలయాల్లో సేవలు కనుమరుగు
- ఖాళీ కుర్చీలే దర్శనం
- విధుల్లో 1300 మంది సచివాలయ కార్యదర్శులు
- డీఎస్సీ పరీక్షల తరుణంలో సెలవుపై కొందరు



ఈ చిత్రంలో కనిపిస్తున్న మెంతెం సుబ్బమ్మ వయస్సు 70 ఏళ్లు. ఈమె భర్త ఏడేళ్ల క్రితం మరణించారు. కుమారుడు, కుమార్తెకు వివాహం చేశారు. నగరంలోని సత్యనారాయణపురంలో బాడుగ ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారు. గతంలో పెన్షన్ వస్తుండటంతో కొంత ఊరటగా ఉండేది. అయితే ఇప్పుడు రావడంలేదు. దీని కోసం సచివాలయం చుట్టూ ఏడాదిగా తిరుగుతునా, ఎలాంటి ప్రయోజనం లేదు. దీంతో ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నారు. సచివాలయం వద్దకెళ్తే సరైన సమాధానం చెప్పేవారు కరువయ్యారు. స్థానిక నేతల దృష్టికి తీసుకెళ్లినా, పట్టించుకోవడంలేదు. - నెల్లూరు(బారకాసు)



ఈ చిత్రంలోని చలమచర్ల రామయ్య, ఇళ్ల పెద్ద అంకయ్య నెల్లూరు రూరల్ మండలంలోని కొత్తవెల్లంటి గిరిజన కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరి వయస్సు 60 ఏళ్లకుపైగా ఉంది. అయితే ఆధార్‌లో 48 ఏళ్లని పడింది. సచివాలయ సెక్రటరీల వద్దకెళ్తే నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్, నోటరీ తీసుకురావాలని సూచించారు. దీంతో దరఖాస్తు చేసి తీసుకొచ్చినా, పింఛన్లు మంజూరు కాలేదు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం కరువవుతోంది.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

నెల్లూరు సిటీ: నెల్లూరు నగరపాలక సంస్థ, రూరల్ మండల పరిధిలోని వార్డు సచివాలయాల చుట్టూ ప్రజలు కాళ్లరిగేలా తిరుగుతున్న పరిస్థితి ఏర్పడింది. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు నాణ్యమైన సేవలు, త్వరితగతిన పరిష్కారాలు చూపేందుకు గానూ సచివాలయ వ్యవస్థను అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు అన్ని రకాల యత్నాలు చేస్తూ వచ్చింది. ఇందులో భాగంగా సిబ్బంది సంఖ్యను తగ్గించేందుకు యత్నిస్తున్నారు.

ప్రదక్షిణలు

సచివాలయాల్లో ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. ఇంటి పట్టా, రేషన్‌కార్డు, పింఛన్ కోసం అర్హులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. మరోవైపు వివిధ రకాల సర్వేల పేరుతో బయట ప్రాంతాల్లో సిబ్బంది తిరుగుతున్నారు. ఒకరిద్దరు సెక్రటరీలున్నా, పని తీరు అంతంతమాత్రంగానే ఉంది.

మొరాయిస్తున్న సర్వర్లు

సచివాలయాల్లో దరఖాస్తుదారుడికి సంబంధించిన వివిధ రకాల సేవలను అప్‌లోడ్ చేసే క్రమంలో సర్వర్లు మొరాయిస్తున్నాయి. దీంతో గంటల తరబడి సచివాలయాల్లో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరుసటి రోజు రావాలంటూ సెక్రటరీలు ఉచిత సలహాలిస్తున్నారు.

సెలవులో కొందరు

జూన్‌లో జరగనున్న డీఎస్సీ నేపథ్యంలో పలువురు సచివాలయ కార్యదర్శులు సెలవులో ఉన్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 160 మంది, రూరల్ మండలంలో 10 మంది ఇలా విధులకు రావడం లేదు. ఈ క్రమంలో సచివాలయాల్లోని మిగిలిన సెక్రటరీలపై పనిభారం పడటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు సమయానికి పనులను చేయలేకపోతున్నారు.

బాలలు యాచిస్తూ కనిపిస్తే చర్యలు

• కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు రూరల్: బడిలో చేర్పించిన బాల యాచకులు తిరిగి ఆ వృత్తిలో కనిపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు చేపతామని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. సమగ్ర శిశు సంరక్షణ పథకం అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యలను ఆరా తీశారు. పిల్లల దత్తత విషయంలో నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. బాల కార్మిక నిరోధక చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ముఖ్యమైన ప్రదేశాల్లో గుర్తించిన బాల యాచకులను బడిలో చేర్పించాలన్నారు. ఇందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి, జెడ్పీ సీఈఓ, ఐసీడీఎస్ పీడీ సంయుక్త సమావేశాలు నిర్వహించి బడి ఈడు పిల్లలందరూ బడుల్లో చేరేలా చూడాలన్నారు. పాఠశాలలు ప్రారంభించడానికి కొద్ది సమయం ఉన్నందున ఈలోపు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. అలాగే కేజీబీవీల్లో డ్రాపౌట్ అయిన వారిని దగ్గర్లోని కళాశాలల్లో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో కేసులు తదితరాలపై సమీక్షించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సువర్ణ, డీసీపీఓ సురేష్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, సమగ్రశిక్ష పీడీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో చేపట్టిన భవన నిర్మాణాన్ని మేయర్ స్రవంతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భవిష్యత్తు అవసరాల కోసం రికార్డ్స్ రూము, క్యాంటిన్‌తో పాటు అదనపు గదులను నిర్మిస్తున్నామని వివరించారు. నాణ్యత ప్రమాణాలను పాటించి, నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యాలయ ప్రాంగణంలో పచ్చదనాన్ని మరింత పెంచి, సుందరీకరణ పనులను చేపట్టాలని సూచించారు. పార్కింగ్ స్థలాన్ని పూర్తిస్థాయిలో వినియోగించేలా చూడాలని కోరారు. ఇంజినీరింగ్ విభాగ ఈఈ శేషగిరిరావు, డీఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాసాధన అవసరం



యోగాపై శిక్షణ

నెల్లూరు(బారకాసు): యోగా సాధన అవసరమని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించిన శిక్షణను కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా విద్యను కమిషనర్ అభ్యసించారు. డిప్యూటీ డైరెక్టర్ మాధురి, యోగా మాస్టర్లు బాషా, సెలీనా, రవీంద్ర, వెంకటసుబ్బయ్య, పద్మావతి, కావ్యశ్రీ, రేవతి, లాస్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

• సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎస్పీడీసీఎల్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగ ఉన్నతాధికారులతో కలిసి ఉద్యోగులకు అవగాహన సదస్సును నిర్వహించారు. విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్, ఈఈ శ్రీధర్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సిటీ ప్లానర్ హిమబిందు, సెక్రటరీ శ్రీలక్ష్మి, ఎంహెచ్‌ఓ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

• రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీ – 4 కార్యక్రమంలో కార్పొరేట్ సంస్థలు భాగస్వామ్యం కావడాన్ని కమిషనర్ నందన్ అభినందించారు. వివిధ కార్పొరేట్ సంస్థలకు చెందిన ప్రతినిధులు కమిషనర్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. సిటీ ప్లానర్ హిమబిందు, ఎస్ఈఐఎల్ కంపెనీ ప్రతినిధి కామేశ్వరరావు, సింహపురి ఎస్టేట్స్ డెవలపర్స్ ప్రతినిధి చెన్నారెడ్డి, జియో కంపెనీ ప్రతినిధి విష్ణు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి





వెంగళరావునగర్, కోటమిట్ట యూపీహెచ్‌సీల్లో..

నెల్లూరు(అర్బన్): మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలని వెంగళరావునగర్ యూపీహెచ్‌సీ డాక్టర్ రీనాభారతి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో మహిళలకు అవగాహన సదస్సును కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. రొమ్ము కేన్సర్, సర్వైకల్ కేన్సర్, గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. పీహెచ్‌పీ జిల్లా గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, ఆస్పత్రి కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

• మహిళలు ఆరోగ్యంగా ఉండటం అవసరమని కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ జునైద్ సిద్ధిఖ్ పేర్కొన్నారు. ప్రపంచ మహిళా ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఆరోగ్య కేంద్రంలో రోగులు, నర్సింగ్ సిబ్బందికి అవగాహన కల్పించారు. కిశోరబాలికలకు పౌష్టికాహారాన్ని ఇవ్వడంతో పాటు శుభ్రతపై తగు సూచనలివ్వాలని కోరారు. సీఓ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని స్వర్ణాల చెరువు వద్ద యోగాసనాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్, నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్, అకౌంట్స్ ఆఫీసర్ విజిత తదితరులు పాల్గొన్నారు.

న్యాయస్థానాలపై నమ్మకం ఉంది



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి న్యాయం జరుగుతుందని, కోర్టులపై పూర్తిగా నమ్మకం ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల పేర్కొన్నారు. కాకాణి కుటుంబీకులను డైకస్‌రోడ్డులోని వారి నివాసంలో బుధవారం కలిసిన అనంతరం ఆమె మాట్లాడారు. గతంలో జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎంతో గౌరవంతో వ్యవహరించే వారని చెప్పారు. పేదలకు హానిచేసేతత్వం ఆయనది కాదని తెలిపారు. ఆయనకు తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు.

పేదలకు అన్నదానం

నెల్లూరు(బృందావనం): నగరంలోని నర్తకి సెంటర్‌లో పేదలు, వృద్ధులకు అన్నదానాన్ని బుధవారం నిర్వహించారు. మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో గంగాధర్, మధుసూదన్, రియాజ్, శ్రీధర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

నెల్లూరు రూరల్: మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వృద్ధుడి అదృశ్యంపై కేసును సంతపేట పోలీసులు బుధవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నాలుగో మైలు టిడ్కో కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం మనవడికి తీవ్ర కడుపునొప్పి రావడంతో బృందావనంలోని రామచంద్రారెడ్డి హాస్పిటల్లో చేర్పించారు. ఈ క్రమంలో సుబ్రహ్మణ్యం దంపతులు మనవడి వద్దే ఉంటున్నారు. ఈ తరుణంలో హాస్పిటల్ నుంచి ఆదివారం బయటకొచ్చిన ఆయన అదృశ్యమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఆయన భార్య అనూరాధ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళాకారులకు అభినందన

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో నృత్య రూపకాలను ప్రదర్శించిన కళాకారులను బుధవారం సత్కరించారు. కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు సుబ్బారావు, పేరూరి ప్రదీప్, డేగల సాంబశివరావు, నీలకంఠం శ్రీనివాసులురెడ్డి, నల్లమల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ నేతకు పరామర్శ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత యస్దానీ మేనమామ ఇస్మాయిల్ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. కోటమిట్టలోని వారి నివాసానికి వెళ్లి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సీపీఎం సమైక్యత యాత్రలు





నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పెద్దబజార్, కోటమిట్ట, జెండావీధి, కుక్కలగుంట, ములుమూడి బస్టాండ్, రంగనాయకులపేట తదితర ప్రాంతాల్లో సమైక్యత యాత్రలను సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పార్టీ నగర, రూరల్ కార్యదర్శులు కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్, నేతలు మాదాల వెంకటేశ్వర్లు, షాహినా బేగం, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, నరసింహ, పద్మ, ఫయాజ్, మూలం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ: పాతవెల్లంటి, కొత్త వెల్లంటి, గొల్లకందుకూరు, మట్టెంపాడు, దొంతాలిలో సమైక్యత యాత్రలను నిర్వహించారు. సీపీఎం రూరల్ మండల కార్యదర్శి జనార్దన్, నేతలు అనిల్, పాదర్తి మస్తానయ్య, వెంకయ్య లక్ష్మీప్రసాద్, రాపూరు రమేష్, పాపయ్య, దయాకర్, కోటపూడి సుబ్రహ్మణ్యం, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.


ధన రాజకీయాలు చేయను



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: తాను ధన రాజకీయాలను చేయనని.. నేతలు, కార్యకర్తలపై ప్రేమాభిమానాలతో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. చింతారెడ్డిపాళెంలోని తన నివాసంలో 31వ డివిజన్ నేతలు, కార్యకర్తలతో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తగా ఉంటానని చెప్పారు. గడిచిన పదేళ్లలో రూరల్‌లో రాజకీయాలను చెడగొట్టారని, మద్యం, డబ్బుతో రాజకీయాలను ఎక్కువ చేశారని విమర్శించారు. ప్రస్తుతం దారుణ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. అధికార పార్టీ నేతల బెదిరింపులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, తాను అండగా ఉంటానని చెప్పారు. పార్టీ జిల్లా సెక్రటరీ ఆదిరెడ్డి, సుబ్బారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, నేతలు చిరంజీవి, సీతారామిరెడ్డి, శేఖర్ రెడ్డి, కాలేబు, సుబ్రహ్మణ్యం రాజు, బాబు, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

పేర్లు తొలగించి ఆక్రమణకు యత్నం



నెల్లూరు రూరల్: తమ భూమికి సంబంధించిన అడంగల్‌లో పేర్లను తొలగించి ఆక్రమించేందుకు పలువురు యత్నిస్తున్నారని చేజర్ల మండలం కాకివాయికి చెందిన హరీష్, గిరిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక జర్నలిస్ట్ భవన్‌లో విలేకరులతో బుధవారం వారు మాట్లాడారు. తమ తాత నరసయ్య గతంలో 3.30 సెంట్ల భూమిని కొనుగోలు చేసి, విక్రయ అగ్రిమెంట్‌ను రాయించుకున్నారని తెలిపారు. భూమిని సాగుచేస్తుండటంతో కాలక్రమేణా తమ కుటుంబీకులు నరసయ్య, గిరిబాబు పేరిట అడంగల్‌లో ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. అడంగల్‌ను ఇటీవల పరిశీలించగా, గ్రామంలోని పలువురు పేర్లు నమోదైన అంశాన్ని గుర్తించామని చెప్పారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

తెలుగు మాధ్యమ పాఠశాలలను కొనసాగించరూ..

నెల్లూరు రూరల్: రాష్ట్రంలో పరిపూర్ణ తెలుగు మాధ్యమ పాఠశాలలను కొనసాగించాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో ఉదయభాస్కర్, ఆర్డీఓ నాగఅనూషకు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. అల్లూరు నాగేంద్రసింగ్, నరాల సుబ్బారెడ్డి, సుబ్బయ్య, పద్మావతి, కేశవ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.